క్లుప్తంగా

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

మొయినాబాద్: మండల పరిధిలోని వెంకటాపూర్‌లో మంగళవారం ఎంపీడీఓ సంధ్య, హౌసింగ్ పీడీ చంపలనాయక్ సమక్షంలో లబ్ధిదారుడి ఇంటి స్థలంలో ముగ్గు పోశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నాయకులు విజయ్‌రెడ్డి, యాదగిరి, అజయ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శతసప్త చండీయాగం



చండీయాగంలో పాల్గొన్న భక్తులు

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్‌లో గల కట్టమైసమ్మ దేవాలయ రెండో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణం చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా శతసప్త చండీయాగం పూజలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ లావణ్య, ఆదాయ పన్నుశాఖ మాజీ అధికారి రాములు, వ్యాపారవేత్త జైపాల్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు రమాదేవి, మాజీ ఉపసర్పంచ్ అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ప్రత్యేకాధికారి శ్రీధర్, కమిషనర్ పూర్ణచందర్

చేవెళ్ల: మండల కేంద్రంలోని శ్రీబాలాజీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహించిన జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శానిటేషన్, తాగునీటి వసతులు కల్పించినట్లు మున్సిపల్ ప్రత్యేకాధికారి శ్రీధర్ అన్నారు. మంగళవారం ఆయన ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన జాతరలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై ఆరా తీశారు. జాతరకు వచ్చిన భక్తుల కోసం ప్రత్యేకంగా తాగునీటిని కేంద్రం ఏర్పాటు చేశామని, శానిటేషన్ పనులు కూడా ఎప్పటికప్పుడూ సిబ్బందితో చేయించామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి అందరి సహకారాలు ఉండాలని, అందరినీ కలుపుకొని అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, మున్సిపల్ అధికారి రాఘేందర్ తదితరులు ఉన్నారు.

ఐకమత్యం, భక్తితో సాగుదాం

శబరిమల పాదయాత్ర బృందం నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి



పాదయాత్ర సమితి సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: శబరిమలకు పాదయాత్రగా వెళ్లే భక్తులందరూ అయ్యప్ప కృప, సంకల్పంతో ఐకమత్యంగా ఉండాలని ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, శబరిమల పాదయాత్ర బృందం నాయకుడు అల్లం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం అజీజ్‌నగర్ మున్సిపాలిటీలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో అయ్యప్ప పాదయాత్ర చేసిన భక్తులందరూ సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం నుంచి శబరిమలకు పాదయాత్రగా వెళ్లే భక్తులందరూ ఐకమత్యంతో ఉంటే ఎలాంటి ఇబ్బంది లేకుండా స్వామివారి సన్నిధికి చేరుకొని దర్శించుకుంటామన్నారు. వచ్చే సంవత్సరం పాదయాత్రలో పాల్గొనే భక్తులందరి కోసం తెలంగాణ గ్రూప్ ఏర్పాటు చేశామని, ఈ గ్రూప్‌లో మెంబర్ షిప్‌గా నమోదు చేసుకోవాలని కోరారు. భక్తులందరికీ గ్రూప్ ద్వారా సౌకర్యాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పవన్‌నాయుడు, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్‌యాదవ్, బుచ్చిబాబు, రమేశ్, వివిధ ప్రాంతాల అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

వేతన వెతలు

కొన్ని నెలలుగా జీతాలు రాక ఇబ్బంది పడుతున్న జీపీ కార్మికులు



కేశంపేటలో పనులు చేస్తున్న కార్మికులు

జీపీల్లో పనిచేస్తున్న కార్మికుల కష్టాలు వర్ణనాతీతం. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న లేబర్‌కు జీతాలు రాక అష్టకష్టాలు పడుతున్నారు. ఒకటి, రెండు కాదు.. ఐదు నెలలుగా జీతాలు అందడం లేదు. దీంతో కుటుంబ పోషణ కోసం దొరికిన పైసలు తెచ్చుకుంటుండడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. శానిటేషన్ విభాగంలో పూట గడవలేని వారే పనిచేస్తుంటారు. అలాంటి వారికి అనేక కారణాలతో నెలల తరబడి వారికిచ్చే చిన్న జీతాలను నిలిపి వేయడంతో వారు దుర్భర జీవితాలను గడుపుతున్నారు.

కేశంపేట: నిధులు లేకపోవడంతో కార్మికులకు జీతాలు చెల్లించలేని దుస్థితికి గ్రామ పంచాయతీలు చేరుకున్నాయి. గతంలో సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు చేసిన అభివృద్ధి పనులకు నిధులు లేక బిల్లులు రాకపోవడంతో అప్పుల పాలవగా, గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు కూడా జీతాలను చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. చాలీచాలని జీతాలతో జీవితం గడుపుతున్న కార్మికులకు 3 నుంచి 5 నెలలుగా జీతాలు రాకపోవడంతో దుర్భర జీవితాన్ని గడుపున్నారు.

- ఎస్టీఓలో చెక్కులు పెండింగ్
- జీతాలు ఇవ్వలేని స్థితిలో జీపీలు

103 మంది..

మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి, వీటి పరిధిలో 103 మంది మల్టీపర్పస్ కార్మికులుగా పనిచేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో 500ల జనాభాకు ఒక్కరు చొప్పున మల్టీ పర్పస్ కార్మికులను అధికారులు, ప్రజాప్రతినిధులు నియమించుకున్నారు. వీరికి నెలకు 9,500ల చొప్పున గ్రామ పంచాయతీలు జీతాలను చెల్లిస్తున్నాయి.

ఐదు నెలలుగా పెండింగ్‌లోనే..

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మల్టీ పర్పస్ కార్మికులకు మూడు నుంచి ఐదునెలలుగా జీతాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. జీతాలు లేకపోవడంతో కార్మికులు కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో బిల్లులు చేసిన ట్రెజరీ వద్ద పెండింగ్‌లో ఉంటున్నాయి. గతంలో సర్పంచ్‌లు ఉన్నప్పుడు జీతాలను సర్దుబాటు చేసి నగదు రూపంలో ఇచ్చి బిల్లులు వచ్చిన తర్వాత మళ్లీ తీసుకునేవారు. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులు జీతాలను సర్దుబాటు చేసే పరిస్థితి లేదు. జీతాల కోసం పంచాయతీ కార్మికులు ఉన్నతాధికారులను కలిసిన సమస్య పరిష్కారం కావడం లేదు. ధర్నాలు నిర్వహించిన తమను ఎవరూ పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతినెల వేతనాలు అందించాలి



గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ప్రతినెలా బిల్లులను చెల్లించాలి. వేతనాలు లేకపోవడంతో కార్మికులకు కుటుంబ పోషణ భారంగా మారింది. అలాగే కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి.

–రాంచంద్రయ్య, జీపీ కార్మికుల సంఘం జిల్లా జనరల్ సెక్రటరీ

కుటుంబ పోషణ భారం



గ్రామ పంచాయతీ ద్వారా 8,500ల జీతం అందిస్తుంది. వచ్చే జీతంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం తమకు జీతాలను పెంచాలి. అదేవిధంగా నెల నెలా జీతాలు చెల్లించాలి. తమకు పనికి తగిన వేతనం రావడం లేదు. ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లను పరిష్కరించాలి.

– స్వరూప, మల్టీపర్పస్ వర్కర్, కోనాయపల్లి

ఉన్నతాధికారులకు తెలియజేశాం

గ్రామ పంచాయతీల్లో ఉన్న నిధులతో కొన్ని గ్రామాల్లో జీపీ కార్మికులకు దినసరి కూలీ డబ్బులు అందించాం. మరికొన్ని గ్రామాల్లో చెక్కులను ఇచ్చాం. ఈ చెక్కులు ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామాల్లో కార్మికుల దినసరి కూలీ పెండింగ్ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేశాం.

– కిష్టయ్య, ఎంపీఓ

బిల్లులు ఇలా..

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ కార్మికులకు టీఎస్‌బీపాస్ నుంచి దినసరి కూలీ చెల్లించాల్సి ఉంటుంది. కానీ టీఎస్‌బీపాస్ అకౌంట్‌లో డబ్బులు లేకపోవడంతో గ్రామపంచాయతీ అకౌంట్‌లో డబ్బులు ఉంటే చెక్కులను క్రియేట్ చేసి ఎస్టీఓకి పంపిస్తున్నారు. అక్కడ చెక్కులు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులకు దినసరి కూలీ రావడం లేదు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్



మాట్లాడుతున్న పూర్ణచందర్

చేవెళ్ల: వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన చేవెళ్ల మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మున్సిపల్ పరిధిలో కలిసిన ఎనిమిది గ్రామాల పరిధిలో ప్రస్తుత నీటి పరిస్థితి, నీటి వనరులపై వివరాలు సేకరించామని తెలిపారు. ఇటీవల కలెక్టర్ ఆదేశాలతో ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష కూడా నిర్వహించామన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలో 21,559 జనాభా 6వేల కుటుంబాలు, 19,685 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ వేసవిలో తాగునీటి సమస్యలకు సంబంధించి రూ.35లక్షల ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం ఈ నెల 31వ తేదీవరకు ఎల్‌ఆర్ఎస్‌కుయ సంబంధించి 25శాతం రాయితీని కల్పించిందని, ప్లాట్ల యజమానులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న మున్సిపల్ పరిధిలోని ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు మున్సిపాలిటీకి అందలేదని, ఒకటి, రెండు రోజుల్లో వస్తాయని తెలిపారు. అప్పటివరకు నేరుగా హెచ్ఎండీఏ నుంచి లబ్ధిదారులకు వస్తున్న మెసేజ్‌ల ప్రకారం ఆన్‌లైన్ ద్వారా ఎల్‌ఆర్ఎస్ కట్టుకోవాలని చెప్పారు. మున్సిపాలిటీకి ఇంకా పూర్తిస్థాయి అధికారులు సిబ్బంది రావాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతానికి మున్సిపల్ పరిధిలోని ఆరు మంది కార్యదర్శులు ఇతర మున్సిపాలిటీ నుంచి ఇన్‌చార్జిలుగా వేసిన ఒక్కరిద్దరు అధికారులతో పనులు కొనసాగిస్తున్నామని తెలిపారు. టాక్స్ వసూళ్లకు సంబంధించిన యంత్రాలు రావాల్సి ఉందని, అవి వచ్చిన వెంటనే పన్నుల వసూళ్లు కూడా చేపడుతామని చెప్పారు.

రైతులు సంఘటితం కావాలి

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గజేందర్‌గౌడ్



గోమాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న గజేందర్‌గౌడ్ తదితరులు

షాబాద్: రైతులందరూ పార్టీలకతీతంగా సంఘటితం కావాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గడిగె గజేందర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కేశవగూడ గ్రామంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కిసాన్ సంఘ్ జెండా ఆవిష్కరించి, గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులందరూ పార్టీలకతీతంగా సంఘటితం కావాలని సూచించారు. రైతుల సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ సభ్యులు కృష్ణయ్య, పెంటయ్య, ఒగ్గు మల్లయ్య, బీర్ల చెన్నయ్య, చంద్రయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, నాగులపల్లి చెన్నయ్య, కుమార్, పెంటయ్య, రైతులు తదితరులు ఉన్నారు.

లబ్ధిదారులకు డబుల్ ఇళ్లు అందించాలి

సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి దేవేందర్



అజీజ్‌నగర్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మొయినాబాద్: ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో ప్రభుత్వం నిర్మించిన డబుల్ ఇళ్లను మంగళవారం సీపీఎం నాయకులు పరిశీలించారు. అనంతరం గ్రామంలో లబ్ధిదారులను కలిసి మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లను ఏడేళ్ల పాటు నిర్మించి అర్హులను గుర్తించినా.. ఈ ప్రభుత్వం లబ్ధిదారులకు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. డబుల్ ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలను వెంటనే ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. అదేవిధంగా అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని.. ట్రాఫిక్ జామ్‌తో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, చేవెళ్ల డివిజన్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, మహేందర్, యేసు, ఉస్మాన్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా సద్గురు రామయ్య వార్షికోత్సవం

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో గల సద్గురు వారణాసి రామయ్య దేవాలయంలో 83వ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో సద్గురు వరప్రియ శిష్య బృందం గ్రామపెద్దలు, వివిధ గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అజీజ్‌నగర్ గ్రామానికి చెందిన భజన మండలి ఆలపించిన భక్తి పాటలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సద్గురు వారణాసి రామయ్యకు పూలు, పండ్లు, మహామంగళహారతి సమర్పించారు. విచ్చేసిన భక్తులకు స్వామివారి దర్శనం, తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం అందించారు. దీంతో గ్రామంలోని దత్తాత్రేయ ఆలయంలో భక్తుల సందడి నెలకొంది.



పూజల్లో పాల్గొన్న భక్తులు

పనులు పూర్తిచేయాలి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి 28వ డివిజన్ కాలనీలో నిలిచిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కార్పొరేషన్ మేనేజర్ నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. శ్రీమారుతినగర్ కాలనీలో డ్రైనేజీ పనులు పూర్తి చేయకుండా వదిలేశారని ఆరోపించారు. కాలనీ డ్రైనేజీలను అవుట్‌లెట్‌కు అనుసంధానం చేయకుండా నిలిపివేశారని పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో కాలనీలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. 1,8,9 లైన్లలో డ్రైనేజీని అసంపూర్తిగా వదిలివేశారని, 5,6,7 లైన్లను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ఈగలు, దోమలు పెరిగి ఇబ్బంది పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి అసంపూర్తి పనులను పూర్తి చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో అగిరిశెట్టి సైదులు, ప్రవీణ్, చైతన్య, మహేశ్, బాపనయ్య, అరవింద్, శ్రీనివాస్, యాదగిరి, మహేందర్, రతన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం

కొందుర్గు: కొందుర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–01లో పదో తరగతి పూర్తయిన విద్యార్థులు మంగళవారం హెచ్ఎం గోపినాథ్‌కు రూ.8వేల విరాళం అందజేశారు. అదేవిధంగా పాఠశాల తరగతి గదుల మరమ్మతు కోసం ట్రాక్టర్ కంకర, డస్ట్, 10 బస్తాల సిమెంట్ సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం దాతలను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రవి, గోపి, నర్సింలు పాల్గొన్నారు.

Document Missing

I, Kaparthi Chandra Shekar S/o K Yadagiri, R/o H No: 3-77/1, Asha Colony, Shadnagar Town, Farooqnagar Mandal, Rang Reddy Dist., I have lost my Original Sale Deed Regd.Doc No 1319/1994, SRO Shadnagar, While Shifting from my house to another place. If anyone finds please contact to me on: 9346834888

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



దాత గోవర్ధన్‌ను అభినందిస్తున్న సీఐ కృష్ణంరాజు

కందుకూరు: మండల పరిధిలోని సాయిరెడ్డిగూడకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు సప్పిడి గోవర్ధన్ గ్రామ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు మంగళవారం రూ.20వేల విరాళం ప్రకటించారు. ఈ మేరకు గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణంరాజుకు ఆయన విరాళానికి సంబంధించిన నగదును అందించారు. అనంతరం సీఐ ఆయనను అభినందించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టండి

మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజామొయిజుద్దీన్



సురంగల్‌లో వన నర్సరీని పరిశీలిస్తున్న ఖాజామొయిజుద్దీన్

మొయినాబాద్: వచ్చే వర్షాకాలం నాటికి నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజామొయిజుద్దీన్ సూచించారు. మున్సిపాలిటీలోని సురంగల్, పెద్దమంగళారం గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా పరిస్థితులను తెలుసుకున్నారు. వన నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. మొక్కలు ఎండలకు దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య లోపం, మంచినీటి సరఫరా సమస్యలు లేకుండా చూస్తున్నామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తేవాలన్నారు. నల్లాలకు తప్పనిసరిగా ట్యాప్‌లు బిగించుకోవాలని సూచించారు. వేసవిలో నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, భాస్కరాచారి తదితరులు ఉన్నారు.

అనవసర ఆరోపణలు సరికాదు

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్

షాద్‌నగర్: అధికార పార్టీ నేతలు తమపై అనవసరమైన ఆరోపణలు చేయడం సరికాదని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు అభివృద్ధిపై దృష్టి సారించకుండా ప్రతిపక్ష పార్టీ నేతలపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఫరూఖ్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ రూ.71లక్షలు మంజూరు చేయించారని, అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్‌తో ఒప్పందం కూడా జరిగిందన్నారు. ప్రభుత్వం మారడంతో పాఠశాల అభివృద్ధి పనులు నిలిచిపోయాయన్నారు. ప్రస్తుతం విమర్శలు చేస్తున్న అధికార పార్టీ నేతలు గతంలో పాఠశాల ఆవరణలో నాసికంగా పనులు చేపట్టారని ఆరోపించారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో అంజయ్యయాదవ్ నియోజకవర్గంలో విద్యారంగాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. జేపీ దర్గా వద్ద ఎస్సీ గురుకుల పాఠశాల, కొందుర్గులో కస్తూర్బా పాఠశాల భవనాలు, పట్టణంలోని అసంపూర్తిగా ఉన్న డిగ్రీ కళాశాల భవనాన్ని గత ప్రభుత్వ హయాంలో చేపట్టినట్లు తెలిపారు. విద్యాభివృద్ధి విషయంలో తమను విమర్శించడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు రవియాదవ్, జూపల్లి శంకర్, కానుగు అంతయ్య, శేఖర్, రామకృష్ణ, అశోక్‌యాదవ్, శీలం శ్రీకాంత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నటరాజన్

కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదు



షాద్‌నగర్ చౌరస్తాలో బీజేపీ శ్రేణుల సంబురాలు



చేవెళ్లలో..

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి
- మల్క కొమురయ్య విజయంపై నేతల సంబురాలు

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మడం లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, అదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య విజయంపై మంగళవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్ పటేల్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణ చౌరస్తాలో నేతలు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పటాసులు కాల్చి, సీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీజేపీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే కొమురయ్య విజయం సాధించడం హర్షణీయమన్నారు. ఎన్నిక ఏదైనా గెలుపు మాత్రం బీజేపీదేనన్నారు. కార్యక్రమంలో చెట్ల వెంకటేశ్, మురళీ, శ్రీనివాస్‌చారి, విజయ్, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య విజయంపై మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై మంగళవారం బీజేపీ మండల నాయకుల ఆధ్వర్యంలో టపాకాయలు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఉపాధ్యాయులు విశ్వసించి టీపీయూఎస్ బలపరిచిన బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యను గెలిపించారన్నారు. ఈ గెలుపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కుంచం శ్రీనివాస్, శ్రీనివాస్, శర్వలింగం, కృష్ణగౌడ్, వెంకట్‌రాంరెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీకాంత్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, అభిలాశ్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపొందడంపై మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు రొల్ల రాధిక, నాయకులు రొల్ల రఘురాంగౌడ్, కుమ్మరి నర్సింలు, మధుసూదన్‌గౌడ్, కంచుకోట మహేశ్, యుగేంధర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య గెలుపుపై కొందుర్గులో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి ఉపాధ్యాయులకు మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, వీరేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564